ఇది భగవంతుడి సమయం




- 'వారాహి' డిక్లరేషన్ సభ విజయవంతం
- పలు భాషల్లో సాగిన పవన్ ప్రసంగం

తిరుపతి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జనసేన అధినేత పవన్ కల్యాణ్ సభ సనాతన వాదుల్లో చైతన్యం నింపింది. హిందూ ధర్మ పరిరక్షకుల్లో ప్రేరణ నింపింది. అయితే సభకు ఎక్కువగా హాజరైన యువతను మాత్రం కాస్త నిరాశపరిచింది.గురువారం సాయంత్రం సరిగ్గా 6 గంటలకు తిరుమల నుంచీ తిరుపతిలోని జ్యోతీరావు పూలే కూడలికి చేరుకున్న పవన్ కల్యాణ్ వారాహి వాహనంపై నుంచీ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. గంటా నలభై నిమిషాల పాటు ఏకధాటిగా, ఆవేశపూరితంగా ఆయన ప్రసంగం సాగింది.యువత తొలుత ఈలలు, కేకలతో కేరింతలు కొట్టడంపై పవన్ స్పందిస్తూ..'ఇది ఎన్నికల సమయం కాదు. సినిమా సమయం అంతకన్నా కాదు. మీతో చప్పట్లు కొట్టించుకోవడానికో, జేజేల కోసమో ఇక్కడికి రాలేదు. సనాతన ధర్మాన్ని మట్టిలో కలిపేస్తామన్న వారితో గొడవ పెట్టుకునేందుకువచ్చా' అని చెప్పడంతో సభ ఒక్కసారిగా మౌనం దాల్చింది. 'ఓం నమోనారాయణాయ' మంత్రంతో మొదలుపెట్టి..'నది ప్రజలను విడిచిపోలేదు. భాష దేశాన్ని దాటిపోలేదు. నేను మన నేలను విడిచి పారిపోలేదు' అంటూ సనాతన ధర్మంపై జరుగుతున్న దాడిని ఎదిరించేందుకు వచ్చానంటూ ఒకే మాటలో చెప్పారు.'నేను అన్ని మతాలను, వారి ధర్మాలను గౌరవిస్తా. అయితే సనాతన ధర్మంపై దాడి చేస్తానంటే మౌనంగా కూర్చోలేను. దశాబ్దానికి పైగా నన్ను వ్యక్తిగతంగా తిట్టారు. కించపరిచారు. అయినా ఏరోజూ మాట్లాడలేదు. కలియుగదైవానికి అపచారం జరిగితే కూడా ఎలా ఊరుకుంటానంటూ తనదైన శైలిలో హెచ్చరికలు చేశారు.తెలుగుతో పాటు మధ్యమధ్యలో ఆంగ్లం, హిందీ, తమిళ భాషల్లో పవన్ ప్రసంగం సాగింది. సనాతన ధర్మం లాంటి వైరస్‌ను అంతం చేయాలని చెప్పిన తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధికి తమిళ భాషలోనే కౌంటర్ ఇచ్చారు. ఇలాంటి ప్రకటన ఒక ఇస్లాం మీద జరిగితే వెంటనే దేశంలోని కోర్టులన్నీ స్పందిస్తాయి. శిక్షిస్తాయి. కానీ సనాతన ధర్మంపై ఏమైనా మాట్లాడితే మాత్రం కోర్టులు కూడా మౌనంగా ఉంటాయని ఇంగ్లీషులో న్యాయస్థానాల వ్యవహారశైలిపై కూడా సున్నితంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. అయోధ్య రామాలయ ప్రారంభ వేడుకలను నాచ్ గానా అంటూ అవహేళన చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలను తప్పుబడుతూ సూడో సెక్యులరిస్టులంటూ హిందీలో మాట్లాడారు. టీటీడీ మాజీ ఛైర్మన్ కరుణాకర రెడ్డిని కొండెక్కి అరచేతిలో హారతి వెలిగించుకునే మీ డ్రామాలకు తగిన మూల్యం చెల్లిస్తారంటూ హెచ్చరించారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుపతిలో తొలిసారి నిర్వహించిన వారాహి సభ జిల్లాలో జనసేనను రాజకీయంగా పటిష్టపరుచుకోవడానికి ఉపయోగపడుతుందని పార్టీ శ్రేణులు భావించాయి. అయితే పవన్ ప్రసంగం వారాహి డిక్లరేషన్‌కే పరిమితమవడం వారిని నిరాశపరిచింది. సభకు అంచనాలకు తగ్గట్టుగానే భారీగా అభిమానులు హాజరయ్యారు. తిరుపతి నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగానూ, ఇరుగుపొరుగు జిల్లాల నుంచీ కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అంచనాలకు అనుగుణంగా వారాహి సభ సక్సెస్ కావడం కూటమి పార్టీల నేతలను సంబరపరిచింది.తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్,జనసేన నాయకులు డాక్టర్ హరిప్రసాద్, టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డితదితరులు వాహనంపై పవన్‌తో వున్నారు.మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మను వాహనంపైకి పిలిచినప్పటికీ ఎక్కకుండా వెళ్లిపోయారు.

> 'పవన్ ఉన్నాడంటే శ్రీవారి దయ. నా తల్లి నాకు అన్నప్రాసన చేసిందీ తిరుమల కొండపైనే.తిరుపతి బాలాజీ కాలనీలో యోగిని రాజేశ్వరి దేవి దగ్గర యోగా నేర్చుకున్నా'

చెత్త పన్నునుంచి విముక్తి

మరో హామీ నెరవేర్చిన చంద్రబాబు



చిత్తూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):అధికారంలోకి వస్తే చెత్త పన్ను రద్దు చేస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. సీఎంగా ఆయన ప్రమాణ స్వీకారానికి ముందే మౌఖిక ఆదేశాలు అందినా.. అధికారికంగా బుధవారం మచిలీపట్నంలో చంద్రబాబు చెత్త పన్ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.చంద్రబాబు తాజా నిర్ణయంతో జిల్లాలోని పట్టణ ప్రాంత ప్రజలకు ఊరట కలిగింది.కరెంటు, ఆర్టీసీ ఛార్జీలు, మద్యం ధరలు ఇష్టానుసారం పెంచేసి సామాన్యుల నడ్డి విరిచిన జగన్.. చెత్త పన్నుతో పట్టణవాసులను ఇబ్బంది పెట్టారు. మున్సిపల్ కార్పొరేషన్లలో ఇంటికి రూ.120 చొప్పున, మున్సిపాలిటీల్లో రూ.90 చొప్పున నెలకోసారి వసూలు చేశారు. దుకాణాల మీద ఈ పన్ను భారం మరింత అధికంగా ఉండేది. జిల్లాలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మరో నాలుగు మున్సిపాలిటీలున్నాయి. కుప్పం కొత్తగా మున్సిపాలిటీగా ఏర్పడడంతో దాన్ని మినహాయించి మిగిలిన పుంగనూరు, పలమనేరు, నగరి మున్సిపాలిటీల్లో చెత్త పన్ను వసూలు చేశారు. 2022 జూలై 1వ తేదీ నుంచి ఆయా మున్సిపాలిటీల్లో ఎంపిక చేసిన వార్డుల్లో పన్ను వసూలుకు శ్రీకారం చుట్టారు. చిత్తూరులో 50 డివిజన్లు ఉండగా.. తొలుత 11 డివిజన్లను ఎంపిక చేశారు. చెత్త సేకరణకు 11 క్లాప్ ఆటోలను చిత్తూరుకు ప్రభుత్వం పంపింది. ఈ డివిజన్లలో కుటుంబాల సంఖ్యను బట్టి రూ.1.71 కోట్ల పన్ను వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో వసూలులో మున్సిపల్ సిబ్బంది కూడా ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఈ 11 డివిజన్లలోనే రూ.70 లక్షల చెత్త పన్ను వసూలు చేశారు. పుంగనూరు నుంచి రూ.21 లక్షలు, పలమనేరులో రూ.12 లక్షలు, నగరి మున్సిపాలిటీ నుంచి రూ.8 లక్షల్ని వసూలు చేశారు. మొత్తంగా జిల్లాలో పట్టణ ప్రాంతాల ప్రజల ముక్కు పిండి మరీ రూ.1.10 కోట్లను వసూలు చేశారు.చెత్తపన్ను రద్దు తక్షణం అమల్లోకి వస్తుందని చంద్రబాబు ప్రకటించడంతో పట్టణ ప్రజలకు ఊరట లభించింది.

డ్రోన్ కనుసన్నల్లో కుప్పం అభివృద్ధి

నెలకోసారి ప్రభుత్వానికి నివేదిక

మున్సిపాలిటీలో వినూత్న ప్రయోగం





కుప్పం ఎన్టీఆర్ కూడలిలో డ్రోన్‌ను ప్రయోగాత్మకంగా ఎగురవేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు

కుప్పం, అక్టోబరు 3: కుప్పం పట్టణ అభివృద్ధి పనులను డ్రోన్ ద్వారా పర్యవేక్షించే వినూత్న ప్రయోగానికి కుప్పం మున్సిపాలిటీ శ్రీకారం చుట్టింది. కమిషనర్ శ్రీనివాసరావుతోపాటు కౌన్సిలర్లు గురువారం ఆర్టీసీ బస్టాండు ముందు ఎన్టీఆర్ కూడలిలో డ్రోన్‌ను ఎగురవేశారు.కుప్పాన్ని మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి పరచాలనే సీఎం చంద్రబాబు ఆలోచనల్లో భాగంగానే ఈ కార్యక్రమం చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు.

డ్రోన్ ద్వారా ఏం చేస్తారు..?

టీడీపీ అధికారంలోకి రాకముందు అయిదేళ్ల పాటు మున్సిపాలిటీ దుస్థితి గురించి ఫొటోలను, వీడియోలను ఇప్పటికే తీసి ఉంచారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీ అభివృద్ధిలో కదలిక మొదలైంది. అక్కడక్కడా మురుగు కాలువలు, డివైడర్లు, ట్రాఫిక్ సర్కిళ్లలో సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. ప్రత్యేకించి పారిశుధ్య నిర్వహణపై కమిషనర్ శ్రీనివాసరావు దృష్టి పెట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు చెత్తపన్ను రద్దు చేసిన నేపథ్యంలో ఇంటింటికీ మున్సిపల్ ట్రాక్టర్లు, చిన్న ఆటోలు పంపి, చెత్తను సేకరించే కార్యక్రమం ఇప్పటికే సాగుతోంది. కమిషనర్ స్వయంగా ఆయా వార్డులకు వెళ్లి, స్థానిక వార్డు కౌన్సిలర్లను కలుపుకుని చెత్తరహిత మున్సిపాలిటీ నిర్మాణంపై ప్రజలకు అవగాహన సదస్సులు కూడా నిర్వహించారు.ఈ అభివృద్ధి పనులను మరింత పకడ్బందీగా పర్యవేక్షించేందుకు డ్రోన్ ద్వారా పర్యవేక్షణ జరపాలని నిర్ణయించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఈ వంద రోజుల్లో జరిగిన అభివృద్ధిని డ్రోన్ ద్వారా ఫొటోలు, వీడియోలు తీసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు. ఇంకా ఎక్కడెక్కడ ఎటువంటి అభివృద్ధి చేయాలో ఒక అంచనాకు రావడానికి ఈ డ్రోన్ పర్యవేక్షణ ద్వారా సాధ్యపడుతుంది. ఇలా ప్రతి నెలా డ్రోన్ ద్వారా పర్యవేక్షణ జరిపి, నివేదికను ప్రభుత్వానికి పంపుతారు. కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా కుప్పం మోడల్ మున్సిపాలిటీని తీర్చిదిద్దడానికి చేస్తున్న ప్రయత్నంలో భాగమే ఇది.

అస్పియా మృతి దిగ్భ్రాంతి కల్గించింది

హోంమంత్రి అనిత

పుంగనూరు, అక్టోబరు 3: పుంగనూరులో చిన్నారి అస్పియా మృతి విషయం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత బుధవారం రాత్రి ట్వీట్ చేశారు. క్షేమంగా ఇంటికి చేరుతుందని అందరూ అనుకునేలోపే సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులో మృతి చెంది కన్పించడం బాధాకరమన్నారు.పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారని, నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షపడేలా కేసును త్వరగా ఛేదించాలని ఎస్పీని ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

టమోటా ధర పైపైకి

పలమనేరులో కిలో రూ.70



పలమనేరు,అక్టోబరు 3 : పలమనేరు మార్కెట్ యార్డు లో గురువారం టమోటా ధరలు అనూహ్యంగా పెరిగాయి.కిలో టమోటాలు అత్యధికంగా రూ.70 పలికాయి.నెలరోజులుగా కిలో రూ. 20నుంచి టమోటా ధరలు క్రమేపీ పెరుగుతూ వచ్చాయి.వర్షాలు కురయడంతో టమోటా పంట తీవ్రంగా దెబ్బతినడంతో పాటు కర్ణాటక సరిహద్దులో ఉన్న పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాలో సోకిన తెగుళ్లతో కూడా పంటలు దెబ్బతిన్నాయని వ్యాపారులంటున్నారు. అనంతపురం జిల్లా నుంచి టమోటాలు మదనపల్లె, పుంగనూరు, కలికిరి మార్కెట్‌యార్డులకు రాకపోవడంతో టమోటాలకు డిమాండు పెరింగిందంటున్నారు. ప్రస్తుతం రైతులు టమోటా నాటినప్పటికి మరో నెలన్నర రోజులకు గానీ చేతికి పంట రాదని, దీంతో టమోటా ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గత ఏడాది కూడా ఇలాగే టమోటా ధరలు విపరీతంగా పెరిగి 15 కిలోల బాక్సు రూ. 2000 వరకు పలికింది. రోజుకు కనీసం 30నుంచి 50 టన్నుల మేర మార్కెట్‌కు వస్తున్న టమోటాలు అక్టోబరులో తగ్గాయి.ఒకటవతేది పలమనేరు మార్కెట్‌కు 19.60 మెట్రిక్ టన్నులు రాగా ధర కిలో రూ. 54 పలికింది. 2వతేది 12.48 మెట్రిక్ టన్నులు రాగా కిలో టమోటా ధర రూ.67 పలికింది.3వతేది మార్కెట్‌కు 11.28 మెట్రిక్ టన్నులు మాత్రమే రావడంతో టమోటా ధర కిలో రూ. 70కి చేరింది. ఒకవైపు మార్కెట్‌కు వస్తున్న టమోటాలు తగ్గిపోతుండగా ధరలు క్రమేపీ పెరుగుతున్నాయి.పెరిగిన టమోటా ధరల కారణంగా మార్కెట్‌లో చింతపండు ధరలకు కూడా రెక్కలొస్తాయని సీజనల్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

పుంగనూరులో రూ.68.70

పుంగనూరు రూరల్, అక్టోబరు 3: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం కిలో టమోటా రూ.68.70 ధర పలికింది. మొదటి రకం రూ.68.70, రెండోరకం కిలో రూ.65, మూడో రకం రూ.60 చొప్పున వ్యాపారులు యార్డుకు వచ్చిన 16.96 మెట్రిక్‌టన్నుల టమోటాలు కొనుగోళ్లు చేసి డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించారు.

ఊరేగింపుగా వెళ్లి..

- బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన విష్వక్సేనుడు
- శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా అంకురార్పణ



శ్రీవారి సేనాధిపతిగా పిలిచే విష్వక్సేనుడు విశేష అలంకరణతో, గదతో తిరుచ్చి వాహనం అధిరోహించారు. గురువారం సాయంత్రం ఏడు గంటలకు ఆలయం వెలుపలకు ఊరేగింపుగా వచ్చారు. మహద్వారం వద్ద హారతి అందుకుని నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మాడవీధుల్లో బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ సందర్భంగా సేనాధిపతి ఊరేగింపు నిర్వహించారు. మరోవైపు ఆలయంలోని యాగశాలకు సమీపంలో అంకురార్పణ జరిగే ప్రదేశాన్ని ముందుగానే పేడతో అలంకరించారు. ఆ తర్వాత సేనాధిపతి ఊరేగింపు అనంతరం ఆ ప్రదేశంలో బ్రహ్మపీఠాన్ని ఏర్పాటు చేశారు. మంట ద్వారా బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, వక్రతుండ, సోమ, శంత, ఇంద్ర, ఇసాన, జయ అనే దేవతలను ఆహ్వానించారు. అనంతరం భూమాతను ప్రార్థిస్తూ అందులో ముందుగానే సేకరించిన పుట్టమన్నును కుండలలో వేశారు. శాలి, వ్రిహి, యువ, ముద్గ, మాష, ప్రియంగు వంటి నవధాన్యాలను చల్లి నీరు పోశారు. ఆ పాలికలను నూతన వస్త్రంతో అలంకరించి పుణ్యాహవచనం నిర్వహించారు. తర్వాత సోమరాజ మంత్రం, వరుణ మంత్రం, విష్ణుసూక్తం పఠించారు. ప్రతిరోజూ ఈ పాలికల్లో కొద్దిగా నీరు పోస్తూ మొలకలు వచ్చేలా చర్యలు తీసుకుంటారు. ఇలా వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ ఘట్టాన్ని నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతం కావాలని సంకల్పించడంతో పాటు స్వామి ఆశీస్సులు పొందడమే ఈ ఘట్టం ఉద్దేశం. అంకురార్పణలో చల్లిన విత్తనాలు బాగా మొలకెత్తడం వల్ల ఉత్సవాలు కూడా గొప్పగా జరుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ అంకురార్పణ కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేటినుంచి బోయకొండలో దసరా మహోత్సవాలు



ప్రత్యేకాలంకారంలో గంగమ్మ

చౌడేపల్లె, అక్టోబరు 3 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో నేటి నుంచి ఈనెల 12వరకు దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు.4న బాలాత్రిపుర సుందరీదేవి, 5న శాకాంబరీదేవి , 6న అన్నపూర్ణాదేవి, 7న పార్వతీదేవి, 8న ధనలక్ష్మీదేవి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్థినిదేవి, 12న రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇస్తారని తెలిపారు. ఉభయదారులుగా పాల్గొనే భక్తులు రూ.5116 చెల్లించి పాల్గొనవచ్చని తెలిపారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

అస్పియా హంతకులను కఠినంగా శిక్షించాలి



పుంగనూరులో ప్రదర్శనలు చేస్తున్న మహిళ సంఘాలు

పుంగనూరు రూరల్, అక్టోబరు3: చిన్నారి అస్పియాకు మద్దతుగా పట్టణంలోని మహిళా సంఘాలు ఫ్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా సంఘ సభ్యులు మాట్లాడుతూ చిన్నారి అస్పియాను చంపిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే రాత్రి 8.30గంటలకు హిందు, ముస్లిం సోదరులు కలసి ఇందిరాసర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చిన్నారి మృతికి కారకులైన వారిని ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు.

బేట్రాయస్వామి కల్యాణానికి ప్రత్యేక బస్సులు

కుప్పం, అక్టోబరు 3: కుప్పం మండలంలో ఈనెల 5వ తేదీన బేట్రాయస్వామి కల్యాణ మహోత్సవం జరుగనుంది.వివిధ ప్రాంతాలనుంచి వచ్చే భక్తులకోసం ప్రత్యేకంగా బస్సు సర్వీసులను వేసినట్లు కుప్పం ఆర్టీసీ డిపో మేనేజరు పెంచలయ్య తెలిపారు. కుప్పంనుంచి వెండుగంపల్లె, బిరుదనపల్లె, నడిమూరుల మీదుగా బేట్రాయస్వామి కొండకు, కుప్పంనుంచి డీకేపల్లె మీదుగా, గుడ్లనాయనిపల్లెనుంచి కృష్ణదాసనపల్లె, మటార్లపల్లెల మీదుగా, బాబునగర్‌నుంచి అడవిముకలపల్లె, పైపాళ్యం, నడిమూరుల మీదుగా, మోట్లచేను నుంచి పైపాళ్యం, నడిమూరుల మీదుగా, పైపాళ్యం నుంచి, మల్లానూరునుంచి చెక్కునత్తం, వసనాడుల మీదుగా, కుప్పంనుంచి నేరుగా బేట్రాయస్వామి కొండకు ఆర్టీసీ బస్సు సర్వీసులు వేస్తామన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంకు సన్మానం



కుప్పం, అక్టోబరు 3: కుప్పం ఆర్టీసీ డిపోను గురువారం సందర్శించిన ఆర్‌ఎం జగదీశ్‌ను నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక డిపో కార్యాలయంలో శాలువ కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు ఎ.వేలు, ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాసులు, కుప్పం డిపో కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజీపీ.ప్రసాద్, ఛైర్మన్ బొట్టు మణి, అధ్యక్షుడు ఎస్.మునస్వామి, కార్యదర్శి ఇ.జయపాల్, సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప, డిపో నాయకులు గోవిందరాజులు, ఖలీల్, గ్యారేజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దిలీప్ కుమార్, ఆర్టీ సురేశ్ కుమార్, నాయకులు సుభాన్, హరిబాబు, శ్రీధర్, ఏడీసీ ఎన్‌ఆర్.రాజ, బాలాజీ, ఏసీ దిలీప్, చంద్ర, ఎం.మధు తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో రైతు బజార్ ప్రారంభం

పలమనేరు, అక్టోబరు 3 : పలమనేరులో రైతుబజార్‌ను మరో వారం రోజుల్లో ప్రారంభించేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వారపు సంత జరిగే ప్రదేశంలో మున్సిపల్ అధికారులు కేటాయించిన స్థలంలో రూ. 26 లక్షల వ్యయంతో రైతుబజార్ నిర్మించారు. విశాలమైన షెడ్లుతోపాటు గదుల సముదాయం నిర్మించారు. పూర్తయిన రైతుబజార్‌ను మార్కెటింగ్ డీఈ హరినారాయణరెడ్డి గురువారం సందర్శించారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చేతులమీదుగా రైతు బజార్‌ను ప్రారంభించేందుకు అధికారులు నిర్ణయించారు.

ఆర్టీసీ పాసుల జారీకి రెండు రోజుల విరామం

పలమనేరు, అక్టోబరు3 : పలమనేరు ఆర్టీసీ డిపోలో ఈనెల 5, 6 తేదీల్లో బస్సు పాసులు జారీ నిలుపుదల చేస్తున్నట్లు డిపో మేనేజర్ టీకే స్వామి తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఆధునీకరిస్తున్న కారణంగా విద్యార్థుల పాస్‌లతోపాటు అన్నిపాసుల జారీని నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. 7వ తేది యథావిధిగా పాస్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు.

పోస్టాఫీసు ముందు సిబ్బంది నిరసన



పలమనేరు, అక్టోబరు3 : పలమనేరు పోస్టాఫీసు ముందు గురువారం సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. టార్గెట్‌లు, డాక్ కర్మయోగీల ఒత్తిడి తగ్గించాలని వారు డిమాండు చేశారు. పోస్టల్ శాఖలోని రెండు యూనియన్ల పిలుపు మేరకు 3వ తేది నుంచి 5వ తేది వరకు నల్లబాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపడుతున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం తేజ, అస్లాంఖాన్, గోవిందు, బాలసుబ్రమణ్యం తదితర యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పనిచేసినప్పుడే గుర్తింపు

గంగవరం, అక్టోబరు 3 : ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే తగిన గుర్తింపు దక్కుతుందని పంచాయతీరాజ్ డీఈఈ నవీన్‌కుమార్ పేర్కొన్నారు. బదిలీపై చిత్తూరుకు వెళ్తున్న నేపథ్యంలో గురువారం గంగవరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్‌కు మంచిపేరు తెచ్చిపెట్టేలా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత డీఈఈ మహేష్, ఏఈలు శ్రీనివాస్ విద్యాసాగర్, జిల్లా ఎన్జీఓ సంఘ ఉపాధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్, చాణక్య, బాలు, బాబు, రాజశేకర్, పురుషోత్తం, ఇంతియాజ్ లతోపాటు పలంచాయతీరాజ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కేజీఎఫ్ రోడ్డులో మురుగు కాలువల నిర్మాణానికి వినతి

వి.కోట, అక్టోబరు 3: వి.కోట పంచాయతీ పరిధిలోని కేజీఎఫ్ రోడ్డులో మార్కెట్ వద్ద మురుగు నీటి కాలువలు నిర్మించాలని గ్రామస్తులు సర్పంచ్ పీ.ఎన్.లక్ష్మి దృష్టికి తీసుకువచ్చారు. గురువారం వి.కోట సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభకు జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు హాజరై ప్రసంగించారు. పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన పనులపై సభలో చర్చించి ఆమోదం తెలిపారు. పట్టణంలో అనుమతులు లేకుండా సుమారు 2 వేల ఇళ్ల నిర్మాణాలు చేసుకున్నారని, వాటికి అనుమతులు తీసుకుని పంచాయతీ అభ్యున్నతికి ప్రజలు సహకరించాలని ఈవో శివశంకర్ ప్రస్తావించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ అక్మల్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే కుప్పం క్రీడా ప్రాంగణం అభివృద్ధి

కుప్పం, అక్టోబరు3: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే కుప్పంలోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణం అభివృద్ధి జరిగిందని కుప్పం స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డెవలప్‌మెంట్ కమిటీ ప్రతినిధులు అన్నారు. ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో గురువారం వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ స్టేడియాన్ని పట్టించుకునేవారే లేదని విమర్శించారు. ప్రస్తుతం శాప్ ఆధ్వర్యంలో క్రీడా ప్రాంగణాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

బోయకొండలో దసరా ఉత్సవ సందడి


బోయకొండలో దసరా ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో ఏకాంబరం


బోయకొండ ఆర్చి వద్ద ఏర్పాటు చేసి విద్యుత్ దీపకాంతులు

రొంపిచెర్ల గ్రామసభ

రొంపిచెర్ల, అక్టోబరు3: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం సర్పంచ్ ఇబ్రహీంఖాన్ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ యోగానందం మాట్లాడుతూ గృహనిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈవోపీఆర్‌డీ నాగరాజ మాట్లాడుతూ పన్నులు సకాలంలో చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీవో రెడ్డెప్పఆచారి, మండల టీడీపీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, టీడీపీ నాయకులు ఇమ్రాన్‌ఖాన్, గౌస్‌పీర్‌ఖాన్, ఎన్.రామమూర్తి, బాబులాల్, అబూబకర్, వార్డుమెంబరు నాగరాజ పాల్గొన్నారు.

సర్పంచ్‌పై ఎంపీడీవోకు ఫిర్యాదు

రొంపిచెర్ల, అకోటబరు3: చెంచెమరెడ్డిగారిపల్లె సర్పంచ్ రాణి ప్రజలకు అందుబాటులో లేరని, దీంతో గ్రామ సమస్యలు పరిష్కరించే వారులేరని ఆ గ్రామప్రజలు ఎంపీడీవో రెడ్డెప్పఆచారికి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం మారినప్పటి నుంచి పంచాయతీలోని ఏకార్యక్రమానికి హాజరు కాలేదని, గ్రామసభలు నిర్వహించలేదని, తాగునీటి మోటర్లు, స్టార్టర్లు కాలిపోయి సమస్య ఉన్నా పట్టించుకోలేదని తెలిపారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణరాయబారం

సోమల, అక్టోబరు 3: సోమల మండలం కందూరులో జరుగుతున్న మహాభారత యజ్ఞం సందర్భంగా భాగవతారణి గీతాశ్రీ శ్రీకృష్ణ రాయబారం ఘట్టాన్ని శ్రోతలకు వివరించి ఆకట్టుకున్నారు. రాత్రి పీలేరు నాటకమండలి సభ్యులచే నాటకప్రదర్శనకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఉభయదారులైన టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, ధర్మకర్త పి.శ్రీనివాసులు భక్తులకు అన్నదానం చేశారు.

వివాహిత అదృశ్యం



పుంగనూరు రూరల్, అక్టోబరు 3: వివాహిత అదృశ్యంపై గురువారం పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు భర్త హరీష్ తెలిపారు. ఆయన కథనం మేరకు ... పట్టణంలోని మేలుపట్ల సమీపంలో కాపురం ఉన్న హరీష్‌కు ఐదేళ్ల క్రితం మదనపల్లె సమీపంలోని అరవాండ్లపల్లెకు చెందిన పూల మాధవితో వివాహం జరిగింది. హరీష్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తుండగా కొద్దిరోజులుగా భార్య మాధవి సెల్‌ఫోన్‌లో ఎక్కువసేపు మాట్లాడుతున్నట్లు గమనించి మందలించి మాధవి తల్లికి తెలియజేశాడు. దీంతో గత మంగళవారం హరీష్ డ్రైవర్ పనికి వెళ్లడంతో బుధవారం ఉదయం నుంచి కనిపించకుండా పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేటి నుంచి చౌడేశ్వరీ దేవి బ్రహ్మోత్సవాలు

పుంగనూరు రూరల్, అక్టోబరు 3: పుంగనూరు మండలం చదళ్ల వద్ద వెలసిన చౌడేశ్వరీదేవి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 4న బాలత్రిపురసుందరీ అలంకరణ, రాత్రి భరతనాట్యం, 5న మహాలక్ష్మీదేవి అలంకరణ, రాత్రి మ్యాజిక్ షో, 6న గాయిత్రీదేవి అలంకరణ, రాత్రి జబర్దస్త్ టీమ్‌తో వినోదాలు,7న అర్ధనారేశ్వరీ స్వామి అలంకరణ, 8న దుర్గాదేవి అలంకరణ 9న సరస్వతీదేవి అలంకరణ, 10న రాజరాజేశ్వరిదేవి అలంకరణ, 11న చండికాదేవి అలంకరణ, రాత్రి నృత్యప్రదర్శన, 12న చౌడేశ్వరీదేవి అలంకరణ ఉన్నట్లు తెలిపారు. ప్రతిరోజు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం

పలమనేరు, అక్టోబరు3 : పలమనేరులో గురువారం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం 26వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పలమనేరు సమీపంలోని సిల్కుఫారం కాలనీలో మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, శాంతమ్మ, సీపీఎం నాయకులు గిరిధరగుప్తా ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి ఈశ్వర్, కేవీపీఎస్ జెండాను ఎగుర వేశారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ మాట్లాడుతూ దళితులకు రెండు ఎకరాల భూమి, శ్మశాన వాటికకు స్థలం ఇవ్వాలని, దళితులకు 100యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అరుణమ్మ, బాలాజి, బీబీజాన్, పూజిత, హరి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో అమావాస్య పూజలు



రామకుప్పం, అక్టోబరు 3: పట్టణంలోని దిగువవీధి గంగమ్మ ఆలయంలో బుధవారం రాత్రి అమావాస్య పూజలు వైభవంగా నిర్వహించారు. గంగమ్మతోపాటు రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. భక్తులు వచ్చి అమ్మవారికి అర్చనలు చేయించారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


యుగంధర్‌గౌడు (ఫైల్‌ఫొటో)

బైరెడ్డిపల్లె, అక్టోబరు3: బైరెడ్డిపల్లె -పుంగనూరు దారిలో చిన్నచెల్లారగుంట క్రాస్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కుప్పం పీఈఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆకులకొత్తూరుకు చెందిన యుగంధర్‌గౌడు గురువారం మృతి చెందాడు. ద్విచక్రవాహనంలో వస్తున్న యుగంధర్ గౌడును లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు చంద్రమాకులపల్లె విద్యార్థిని



పుంగనూరు రూరల్, అక్టోబరు3: జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు చంద్రమాకులపల్లె ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. యల్లారుబైలుకు చెందిన కొండారెడ్డి, అనురాధ దంపతుల కుమారై రక్షిత ఇటీవల పల్నాడు జిల్లా వినుకొండలో అండర్-17 ఫుట్‌బాల్ పోటీ ల్లో ప్రతిభ కనబరిచింది. ఈనెల 18 నుంచి 24తేదీ వరకు శ్రీనగర్‌లో జరిగే జాతీయ ఫుట్‌బాల్ క్రీడల్లో పాల్గొనేందుకు రక్షిత ఎంపికైనట్లు చెప్పారు. పీడీ మురళీధర్, ఉపాధ్యాయులు జ్యోతి, రమణారెడ్డి, శైలజ, మంజునాథ్, శంకర్‌రెడ్డి, రఘు, సుజాత అభినందించారు.

రామకుప్పంలో కలెక్టరు విస్తృత పర్యటన


పీఎంకేతాండా గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టరు సుమిత్‌కుమార్

రామకుప్పం, అక్టోబరు 3: కలెక్టరు సుమిత్‌కుమార్ గురువారం రామకుప్పం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఉదయం 10గంటలకు కడ పీవో వికాస్ మర్మత్, కుప్పం ఆర్డీవో శ్రీనివాసులురాజుతో కలసి ననియాల ఎకో టూరింజం పార్కుకు చేరుకున్న ఆయన అక్కడి పార్కును, అసంపూర్తిగా ఉన్న ఏపీ టూరిజం డార్మెటరీ భవనాలను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయించాలని, అక్కడ బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయాల్సి ఉందని కడ పీవో కలెక్టరు దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా ననియాల ఎకో టూరిజం ప్రాజెక్టు నుంచి కుప్పం సమీపంలోని నడుమూరు ఎకో టూరిజం పార్కు, మల్లప్పకొండ, బేటరాయస్వామి ఆయల వరకు టూరిజం ప్యాకేజీ ఏర్పాటు చేయాల్సిన అవసరముందని కూడా తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా, టూరిజం ప్యాకేజీ ఏర్పాటు అయ్యేలా చేస్తామని కలెక్టరు తెలిపారు. అనంతరం కుంకీ ఎలిఫెంట్ క్యాంపును సందర్శించారు. కుంకీలు(శిక్షణ పొందిన ఏనుగులు) జయంత్, వినాయక్‌ల పోషణ తదితర విషయాల గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి పీఎంకేతాండాకు చేరుకున్న ఆయన గ్రామస్తులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన విజలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీకి బయలుదేరారు. మార్గ మధ్యంలో పచ్చారుమాకులపల్లెలో యువకులు కలెక్టరు వాహనాన్ని ఆపి గ్రామంలో నెలకొన్న సమస్యలను ఏకరువు పెట్టారు. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరమవుతాయని ఆయన వారికి హామీ ఇచ్చారు. గ్రామంలో తాగునీటి సరఫరా, పశుగ్రాసం లభ్యత తదితర వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి విజలాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన ఆయన వైద్యాధికారులు పూజిత, సాయిశ్రీలతోపాటు సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రాథమిక కేంద్రానికి కావాల్సిన మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. చివరగా ఆయన రామకుప్పం, శాంతిపురం మండలాల్లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు, పరిశ్రమలు ఏర్పాటు చేయనున్న భూములను పరిశీలించారు. కలెక్టరు వెంట పలమనేరు సబ్ డీఎఫ్‌ఓ వేణుగోపాల్, కుప్పం రేంజర్ జయశంకర్, తహసీల్దారు బాబు, ఎంపీడీవో లక్ష్మీకాంత్, టీడీపీ నాయకులు మునస్వామి, పత్రనారాయణ, చలపతి, ఆనందరెడ్డి, నరసింహులు, జనసేన మండల అధ్యక్షుడు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

తోట్లచెరువులో బోటింగ్‌కు కలెక్టరు సానుకూలత


తోట్లచెరువు వద్ద టీడీపీ నేతలతో మాట్లాడుతున్న కలెక్టరు

రామకుప్పం, అక్టోబరు 3: రామకుప్పం మండలం కెంచనబల్ల గ్రామ సమీపంలోని తోట్లచెరువును అన్ని విధాల అభివృద్ధి చేస్తామని కలెక్టరు సుమిత్‌కుమార్ హామీ ఇచ్చారు. పీఎంకేతాండా నుంచి విజలాపురం వెళుతుండగా ఆయన కెంచనబల్ల తోట్లచెరువు వద్ద టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణ, సీనియర్ నేతలు రామ్మూర్తి, జయశంకర్, నాగభూషణం, రామలింగారెడ్డి, వేచి ఉండగా కారు ఆపి దిగారు. తోట్లచెరువు ఆక్రమణలకు గురైందని, ఆక్రమణలు తొలగింపుకు చర్యలు తీసుకోవాలని నేతలు కలెక్టరును కోరారు. అదేవిధంగా చెరువులో బోటింగ్ ఏర్పాటు చేస్తే తమిళనాడు, కుప్పం వైపు నుంచి వచ్చే పర్యాటకులకు సౌకర్యంగా ఉంటుందని వారు కలెక్టరు దృష్టికి తెచ్చారు. బోటింగ్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు హామీ కూడా ఇచ్చారన్న విషయాన్ని వారు ఆయనకు తెలిపారు. తొలుత తోట్లచెరువును సర్వే చేయించి, కట్టలు ఏర్పాటు చేస్తామని, అ తర్వాత బోటింగ్‌ను కూడా ఏర్పాటు చేస్తామని కలెక్టరు వారికి చెప్పారు. అదేవిధంగా ఉన్సిగానిపల్లె పంచాయతీ గోవిందపల్లెలో సంత స్థలం ఆక్రమణలకు గురైందని స్థానిక నేత జయశంకర్ కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. తోట్లచెరువు, గోవిందపల్లె సంత స్థలాన్ని పదిరోజుల్లో సర్వే చేయించి ఆక్రమణలు తొలగించాలని కలెక్టరు తహసీల్దారు బాబును ఆదేశించారు. మణీంద్రం పంచాయతీలో పలు అవకతవకలున్నాయని, సర్పంచు అందుబాటులో లేదని స్థానిక నేతలు రామలింగారెడ్డి, మంజునాథరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు కలెక్టరుకు వినతిపత్రం అందించారు. విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టరు తెలిపారు.

కుప్పం మున్సిపల్ ఆదాయం పెంపునకు చర్యలు

పొరపాట్లను సవరించి పన్నుపోటు లేనివిధంగా ప్రణాళిక ● కమిషనర్ శ్రీనివాసరావు


మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు

కుప్పం, అక్టోబరు 3: కుప్పం పురపాలక సంఘం ఆదాయాన్ని పెంచడం ద్వారా అభివృద్ధిని పరుగులు పెట్టించడానికి చర్యలు తీసుకోనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన, కౌన్సిలర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇంతవరకు పన్నుల విధానంలో ఉన్న లోటుపాట్లను సవరించి, ఆదాయాన్ని పెంచుకునేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కొత్తగా పన్నులు విధించడం, లేదా పెంచడం అనే ప్రజా వ్యతిరేక చర్యలు కాకుండా, ఉన్న వనరులనే పెంచుకునేలా ఈ ప్రణాళిక ఉంటుందన్నారు. పురపాలక సంఘం పరిధిలో చాలా భవనాల అదనపు అంతస్తులకు మున్సిపాలిటీ అనుమతులు లేవని గుర్తించామన్నారు. అలాగే నూతన భవనాలు కానీ, కొన్ని ఇప్పటికే కట్టిన భవనాలు కానీ కొన్నింటికి మున్సిపల్ అనుమతులు లేవన్నారు. మరికొన్ని వాణిజ్య ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నా భవనాలకు నివాస భవనాల కింద చూపి, తక్కువ పన్నులు కడుతున్నారన్నారు. కుళాయి కనెక్షన్లు కూడా అనధికారికంగా ఉన్నాయన్నారు. ఇందువల్ల మున్సిపాలిటీకి న్యాయప్రకారం రావాల్సిన ఆదాయానికి గండి పడుతోందని చెప్పారు. ప్రత్యేకంగా మున్సిపల్ సిబ్బందితో ఒక సర్వే చేసి ఈ పొరపాట్లను లేదా అవకతవకలను సవరిస్తామని, తద్వారా ఆదాయాన్ని పెంచుకుంటామని కమిషనర్ తెలిపారు. ప్రజలు ఈ సర్వేకు సహరించాలని అభ్యర్థించారు. ఈ పెరిగిన ఆదాయంతో మరిన్ని మౌలిక సదుపాయాలను ప్రజలకు అందించడానికి వీలు పడతుందన్నారు. డివైడర్లు, ట్రాఫిక్ సర్కిళ్లలో పచ్చదనం పెంచి, సుందరీకరణ పనులు చేయడం దాదాపు ఇప్పటికే పూర్తయిందన్నారు. డివైడర్లలో, సర్కిళ్లలో లైటింగ్ ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో నాలుగు చోట్ల పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, సోమశేఖర్, సెల్వం, సురేశ్, టీడీపీ నాయకులు జాకీర్, వేలు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పులిచెర్ల మండలాన్ని వీడని గజరాజులు

● పంటలపై కొనసాగుతున్న దాడులు


ఏనుగుల గుంపు దాడిచేయడంతో ధ్వంసమైన వరి పంట

కల్లూరు, అక్టోబర్ 3: పంటలు చేతికొచ్చే వేళ రాత్రికి రాత్రే ఏనుగుల గుంపు దాడులు చేస్తుండడంతో పంటలకు అపారనష్టం వాటిల్లితోంది. పది రోజుల క్రితం మండలంలోకి ప్రవేశించిన గజరాజులు పాతపేట, కల్లూరు, పాళెం, దేవళంపేట పంచాయతీల్లో తిష్టవేశాయి. మూడు రోజులుగా పాళెం, దేవళంపేట పంచాయతీల్లో తిష్ట వేసిన ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. బుధవారం రాత్రి సుమారు 15 ఏనుగుల గుంపు రెండు గ్రూపులుగా విడిపోయాయి. పాళెం పంచాయతీ కోటపల్లి సమీపానికి చేరుకున్న పది ఏనుగుల గుంపు రైతులు హరి, రాజేంద్రకు చెందిన టమోటా పంటను ధ్వంసం చేశాయి. కల్లూరులోని రైతు సయ్యద్‌బాషాకు చెందిన ఎకరా వరి పంటను, కోటపల్లిలోని రైతు దామోదర్‌నాయుడు మామిడిచెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. జూపల్లికి చెందిన సుబ్బరత్నకు చెందిన మోటారు, 10మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. ప్రమీళమ్మకు చెందిన 20 మామిడిచెట్లు, సుబ్రమణ్యంకు చెందిన పశుగ్రాసం, రైతు పురుషోత్తంకు చెందిన 10 మామిడిచెట్లను ధ్వంసం చేస్తూ అడవిలోకి చేరుకున్నాయి. మరో ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ పెనుబాల ఎస్సీ కాలనీ వద్దకు చేరుకొని రైతు నారాయణ టమోటా పంటను ధ్వంసం చేశాయి. సమాచారం అందుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మహ్మద్‌షఫి ఏనుగుల దాడిలో నష్ట పోయిన పంటలను పరిశీలించి పంటనష్ట పరిహారం కోసం బాధిత రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దసరా శరన్నవరాత్రి పూజలు ప్రారంభం


పసుపు అలంకారంలో కన్యకాపరమేశ్వరి, కల్లూరులో పార్వతీదేవిగా కన్యకాపరమేశ్వరి, కామాక్షీదేవిగా అన్నపూర్ణాదేవి, వి.కోటలో దుర్గమ్మ


బైరెడ్డిపల్లెలో సల్లాపురెమ్మ

రామకుప్పం, అక్టోబరు 3: రామకుప్పం మండలంలోని అమ్మవారి ఆలయాల్లో గురువారం శరన్నవరాత్రి పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రామకుప్పం, ఆనిగానూరుల్లోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయాల్లో అమ్మవార్లు పసుపు అంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కంబాలదేవులపల్లె సప్తమాతృక చౌడేశ్వరీ ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, లక్ష్మీకుంకుమ అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు. రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో అమ్మవారికి, స్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు.

గంగవరం : మేలుమాయి క్రాస్ వద్ద వెలసిన మూలాలమ్మ ఆలయంలో గురువారం ఉదయం గోపూజ, స్వస్తివాచనం, మహాగణపతి పూజ, కలశస్థాపన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం కుంకుమార్చన చేశారు. అలాగే గంగవరం సాయినగర్‌లో వెలసిన కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాదేవి అమ్మవారిని అలంకరించి, అభిషేకం పూజలు నిర్వహించి భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందించారు.

కల్లూరు : కల్లూరు కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం, దేవళంపేట కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కల్లూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం గంగ స్వీకరణ, వేదపారాయణం, అభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు. రాత్రి పార్వతిదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవళంపేట కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో కాశీవిశాలాక్షి పసుపు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.


పుంగనూరురూరల్ : పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా అన్నపూర్ణా దేవి కామాక్షీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శ నం కల్పించారు. బజారువీధిలోని కన్యకా పరమేశ్వరీ దేవి, మారెమ్మ ఆలయాల్లో అమ్మ వార్లు ప్రత్యేక అలంకరణల్లో దర్శనమిచ్చారు.

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లెలో వున్న సల్లాపురెమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇ మొదటిరోజు అమ్మవారు స్వర్ణకవచ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి అభిషేకంచేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే స్థానిక బాటగంగమ్మ ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, గడ్డూరు సల్లాపురెమ్మ ఆలయంలో కూడా విశేషపూజలు జరిగాయి.

వి.కోట : వి.కోట దుర్గమాంబ ఆలయంలో తొలి రోజు అమ్మవారు మహాలక్ష్మీదేవిగా కొలువు తీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం ఎదుట గణపతి పూజ, హోమం, దుర్గా పూజ, నవగ్రహ పూజతో ఉత్సవాలకు వేద పండితులు అంకురార్పణ గావించారు.

సీఎం సహాయ నిధికి రూ.50లక్షలు

జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ వితరణ



సీఎం చంద్రబాబుకు చెక్కును అందిస్తున్న జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, అక్టోబరు 3: సీఎం సహాయ నిధికి గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ వితరణగా రూ.50లక్షలను తన పెద్ద కుమారుడు రాహుల్‌తో కలసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు గురువారం అందజేశారు. విజయవాడ వరద బాధితుల సహార్థం తనవంతుగా ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును అమరావతిలో సీఎంను కలసి అందించారు.

పెన్షన్లు జమవుతున్నాయ్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 3: ప్రభుత్వ పెన్షనర్లకు గురువారం ఉదయం నుంచి బ్యాంకు ఖాతాల్లో నగదు జమవడం మొదలైంది. జిల్లాలో 12,213 మంది ప్రభుత్వ పెన్షనర్లు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు విడతల వారీగా మంగళవారం జీతాలు పడటం ప్రారంభంకాగా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం సెలవు రోజైనా సీఎఫ్ఎంఎస్ ద్వారా ఉద్యోగుల బ్యాంకు ఖాతాలకు జీతాలు పడ్డాయి. వైసీపీ ప్రభుత్వంలో ప్రతినెలా 15 లేదా 20వ తేదీ తర్వాతనే పింఛన్లు అందేవన్న సంగతి తెలిసిందే.

రేపు జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

చిత్తూరు రూరల్, అక్టోబరు 3: చిత్తూరులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఉపాధి అధికారి పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ ఫిన్‌కార్ప్, ఇన్నోసోర్స్, అపోలో ఫార్మసీ కంపెనీల్లో పలు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. టెన్త్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18-35 ఏళ్ల లోపువారు అర్హులన్నారు. ఇతర వివరాలకు 91609 40479 నెంబరును సంప్రదించాలని కోరారు.

తొలి రోజున 'టెట్'కు 435 మంది హాజరు



ఎస్వీసెట్ పరీక్ష కేంద్రం వద్ద తనిఖీలు

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 3: టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు (టెట్) గురువారం జిల్లాలో ప్రశాంతంగా మొదలైంది. తొలి రోజున చిత్తూరు జిల్లాలోని రెండు, చెన్నైలోని ఓ సెంటర్‌లోనే పరీక్షలు జరిగాయి. చిత్తూరు జిల్లాలోని ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, పలమనేరులోని మదర్ థెరిసా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల, చెన్నైలోని ఐకాన్ డిజిటల్ జోన్ ఐడీజెడ్‌లో పరీక్షలు జరిగాయి. 492 మంది అభ్యర్థులకు గాను 435మంది హాజరవగా, 57 మంది గైర్హాజరయ్యారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 3: జవహర్ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరానికి తొమ్మిదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వేలాయుధం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి చదువుతూ 2012 జూలై 31లోపు జన్మించిన విద్యార్థులు 9వ తరగతిలో ప్రవేశానికి, టెన్త్ చదువుతూ 2010లోపు జన్మించిన విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి అర్హులన్నారు. 2025 ఫిబ్రవరి 8వ తేదీన ప్రవేశ పరీక్ష జరుగుతుందని అక్టోబరు 30వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రెండు నెలలుగా ఎదురుచూస్తున్న బదిలీలొచ్చాయ్

పెనుమూరు, అక్టోబరు 3: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సాధారణ, అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద బదిలీలకు రెండు నెలలుగా తర్జనభర్జన పడి ఎట్టకేలకు గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఉద్యోగులంతా ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి ఎమ్మెల్యే, ఎంపీ లెటర్లు పెట్టించుకున్నారు. అయితే పంచాయతీ రాజ్ మంత్రి పవన్ కళ్యాణ్ కొత్తగా అమలు చేసిన జీవో ప్రకారం పంచాయతీలకు గ్రేడ్లను కేటాయించడంతో గ్రేడ్ 1-4 వరకు ఉన్నవాటికి ఆ సెక్రటరీలనే కేటాయించాలని, గ్రేడ్-5 పంచాయతీలకు మాత్రం గ్రేడ్-5 సెక్రటరీలను నియమించాలన్న నిబంధన అధికారులకు తలనొప్పిగా మారింది. దీంతో కొంతమంది సిఫార్సు లేఖలకు జిల్లా అధికారులు ప్రాధాన్యం ఇవ్వలేక బదిలీలు చేసేయాల్సి వచ్చింది.

డీసీసీ అధ్యక్షుడి కారు బోల్తా

స్వల్ప గాయాలతో బయటపడ్డ భాస్కర్

వెదురుకుప్పం, అక్టోబరు 3: వెదురుకుప్పం మండలం బలిజమొండివెంగనపల్లెకు చెందిన డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ బుధవారం జీడీనెల్లూరు నియోజకవర్గం, చిత్తూరులో జరిగిన పలు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాత్రి బెంగళూరుకు బయల్దేరారు. తానే కారును నడుపుకుంటూ వెళుతుండగా.. కర్ణాటక రాష్ట్రం కోలారు నుంచి సుమారు రెండు కి.మీ దూరం వెళ్లాక వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆయన స్వల్ప గాయాలతో బయటపడి బెంగళూరుకు వెళ్లినట్లు కుటుంబీకులు తెలిపారు.

ఎంబీయూలో నేడు మోహనమంత్ర ప్రారంభం

చంద్రగిరి, అక్టోబరు 3: మండలంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో శుక్రవారం మోహనమంత్ర కార్యక్రమం ప్రారంభమవుతుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు. 20 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించనున్నారు. ప్రముఖ గాయకుడు రేవంత్ లైవ్ బ్యాండ్ ప్రత్యేకతగా నిలవనుంది. డీజే నైట్స్‌లో మధ్యప్రదేశ్ నుంచి డీజే పారా నాక్స్, నెదర్‌ల్యాండ్ నుంచి ప్రఖ్యాత సింగర్ డీజే ఫంక్ పాల్గొంటారు. ప్రధాన పోషకుడిగా ఎంబీయూ ప్రొ ఛాన్సలర్ మంచు విష్ణు వ్యవహరించనున్నారు. అధ్యక్షులుగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్ ఛాన్సలర్ నాగరాజరామరావ్, చీఫ్ గ్రోత్, స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్ వ్యవహరిస్తున్నారు.

ఎస్వీఐసీసీఏఆర్ ఎండీగా డాక్టర్ ప్రశాంత్



తిరుపతి(వైద్యం), అక్టోబరు 3: తిరుపతి జూపార్కు రోడ్డులోని టాటా క్యాన్సర్ ఫౌండేషన్ వారి ఎస్వీఐసీసీఏఆర్(శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్ రీసెర్చ్) ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్‌గా డాక్టర్ ప్రశాంత్ పెనుమాడును నియమించారు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఐరాలలో రికార్డు స్థాయి వర్షపాతం

120.8 మి.మీ. నమోదు



దివిటివారిపల్లెలో నేలవాలిన వరి



భవనంపై నుంచి కూలిన టవర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 3: జిల్లావ్యాప్తంగా అల్పపీడన ద్రోణి ప్రభావంతో బుధవారం ఉదయం ఎనిమిది నుంచి గురువారం ఉదయం ఎనిమిది గంటల వరకు 25 మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఐరాల మండలంలో అత్యధికంగా 120.8 మి.మీ, గంగాధరనెల్లూరులో అత్యల్పంగా 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. వి.కోటలో 55, బైరెడ్డిపల్లెలో 49.6, పూతలపట్టులో 42.6, యాదమరిలో 39.2, తవణంపల్లెలో 36.4, చిత్తూరు అర్బన్‌లో 34.2, పుంగనూరులో 32.4, బంగారుపాళ్యంలో 30, చౌడేపల్లెలో 28.6, పెద్దపంజాణిలో 28.6, శాంతిపురంలో 28.4, వెదురుకుప్పంలో 19.4, చిత్తూరు రూరల్‌లో 14.8, ఎస్.ఆర్.పురం/రొంపిచెర్లలో 14.2, రామకుప్పంలో 10.8, కుప్పంలో 8, కార్వేటినగరం, గంగవరం, గుడుపల్లెలో 7.6, పలమనేరులో 7.2, పులిచెర్లలో 6.4, గుడిపాలలో 4.8, పెనుమూరులో 2.8 మి.మీ వర్షం కురిసింది.

గాలివానకు కూలిన టవర్

యాదమరి, అక్టోబరు3: తహసీల్దార్ కార్యాలయంపై ఏర్పాటు చేసిన టవర్ బుధవారం రాత్రి కురిసిన గాలివానకు కూలిపోయింది. ఈ భవనంపైన గతంలో ఏపీ స్వాన్ ఇంటర్నెట్ సిగ్నలింగ్ కోసం ఏర్పాటు చేసిన సుమారు 50 అడుగుల ఎత్తున్న టవర్ ఒక్కసారిగా కూలి పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడింది. రాత్రి వేళ కావడం, కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఐరాలలో నేలవాలిన వరి

ఐరాల, అక్టోబరు 3: ఐరాల మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చాన్నాళ్ల తర్వాత గార్గేయినది ప్రవహించింది. సుమారు పది ఎకరాలకు పైగా వరి పంట దెబ్బతింది. 35యర్లంపల్లె పంచాయతీ దివిటివారిపల్లెలో హేమనాథ్‌రెడ్డి చెందిన రెండెకరాల వరి పూర్తిగా ధ్వంసమైంది.

పీఎల్ఆర్ కంపెనీ వేసిన తారురోడ్డుపై విచారణ : మంత్రి లోకేశ్ ఆదేశం

పుంగనూరు, అక్టోబరు 3: ఈ ఏడాది జూలై నెలలో అర్ధరాత్రి ఇంజనీర్లు లేకుండా పుంగనూరులో పీఎల్ఆర్ కంపెనీ వేసిన తారురోడ్డు నిర్మాణాలపై విచారణ జరపాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఇటీవల ఆయన బంగారుపాళ్యం పర్యటనకు వచ్చినపుడు నాణ్యత లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఇంజనీర్లు లేకుండా స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుంచి చౌడేపల్లెకు వెళ్లే రోడ్డును పీఎల్ఆర్ కంపెనీ వేసిందని టీడీపీ నాయకుడు దినేశ్ ఫిర్యాదు చేశారు. రెండో లేయర్ బీసీ సెన్సార్ ఫ్లేవర్ వేయాల్సిందిపోయి మెకానికల్ ఫ్లేవర్‌తో వేశారని, ఎయిర్ కంప్రెషన్ చేయలేదని, రోడ్డు నిర్మాణంలో నిబంధనలు పాటించలేదని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తెలియజేయగా విచారించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మంత్రి లోకేశ్ ఆదేశించారు. దీనిపై విచారించాలని ఎన్‌హెచ్ డీఈ, ఇంజనీరింగ్ అధికారులకు ఫిర్యాదును కలెక్టర్ సుమిత్‌కుమార్ పంపారు.

అస్పియా హంతకులను వదిలిపెట్టం

మహిళా కమిషన్ సభ్యురాలు రుకియా బేగం



అస్పియా తల్లి ఆసియాను పరామర్శిస్తున్న రుకియాబేగం

పుంగనూరు, అక్టోబరు 3: పుంగనూరులో చిన్నారి అస్పియా(6) మృతి దురదృష్టకరమని మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రుకియా బేగం అభిప్రాయపడ్డారు. గురువారం పుంగనూరు ఉబేదుల్లా కాంపౌండ్‌లోని అస్పియా ఇంటికి వెళ్లిన ఆమె మృతురాలి తల్లిదండ్రులు అజ్మతుల్లా, ఆసియాలను పరామర్శించారు.అస్పియా కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ ఘటన చాలా బాధాకరమని, నిందితులను పట్టుకుని శిక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అస్పియా మృతదేహం లభించిన పుంగమ్మ చెరువులో నిర్మించిన సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు వద్దకు వెళ్లి వివరాలు ఆరా తీశారు. అనంతరం పుంగనూరు పోలీసు స్టేషన్ చేరుకుని డీఎస్పీలు ప్రభాకర్, సాయినాథ్, సీఐ శ్రీనివాసులతో చిన్నారి మృతిపై సమీక్షించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ చిన్నారి మృతి రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించిందని, ఇలాంటి సంఘటనలకు మరోసారి అవకాశం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.డీఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ నిందితులను పట్టుకోవడానికి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సుహేల్‌బాషా, సీవీ రెడ్డి, పోలీసుగిరి, ప్రసాద్, అబ్బాస్, కవిత, బీజేపీ నాయకులు అయాబ్‌ఖాన్, నరసింహులు, మరంబాబు, మల్లికారాణి , మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, వైసీపీ నాయకులు షరీఫ్ ,ఇష్తికార్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. ఎస్‌డీపీఐ నాయకులు హాఫిజ్ అతావుల్లా, హనీఫ్, పయాజ్, ఆజాబ్,సద్దాం, జాబివుల్లా కూడా అస్పియా తల్లిదండ్రులను బుధవారం పరామర్శించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సర్వంసిద్ధం

నేటి నుంచి మొదలుకానున్న వాహనసేవలు ● పుష్ప, విద్యుత్ అలంకరణతో ముస్తాబైన కొండ



తిరుమల ఆలయం లోపల అలంకరణలు

తిరుమల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. భక్తుల రద్దీకి తగినవిధంగా టీటీడీ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. గురువారం నుంచే తిరుమలలో బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది. తొలిరోజైన శుక్రవారం సాయంత్రం 5.45 నుంచి 6 గంటల వరకు మీనలగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. రాత్రి 9 నుంచి 11 గంటల వరకు పెద్దశేషవాహన సేవ జరగనుంది. ప్రతిరోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వివిధ వాహన సేవలు జరుగుతాయి. గరుడ వాహన సేవ మాత్రం సాయంత్రం 6.30 గంటలకే మొదలుకానుంది.

ప్రత్యేక దర్శనాలన్నీ రద్దు: పెరటాశి మాసం (తిరుమల శనివారాలు), బ్రహ్మోత్సవాలు ఒకేసారి జరగనున్న నేపథ్యంలో రద్దీ అధికంగా ఉంటుందని టీటీడీ అంచనా వేసింది. దీంతో సిఫార్సు వీఐపీ బ్రేక్, వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐ, రక్షణ సిబ్బందికి, ఇతర ట్రస్టు దాతలకు కల్పించే ప్రత్యేక దర్శనాలన్నీటిని రద్దు చేసింది. బ్రహ్మోత్సవాల్లో సర్వదర్శనం, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలు మాత్రమే ఉంటాయి. స్వయంగా వచ్చే ప్రముఖులకు వీఐపీబ్రేక్ దర్శనం ఉంటుంది. గరుడసేవరోజు ప్రొటోకాల్ దర్శనాలనూ రద్దు చేశారు.

పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం : ధ్వజారోహణం సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. దీనికిగాను ఆయన శుక్రవారం రాత్రి తిరుమల చేరుకుంటారు. బేడిఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణం వద్ద అర్చకులు పరివట్టంచుట్టగా.. తలపై వెండిపళ్లెంలో పట్టువస్త్రాలను ఈవో ఉంచుతారు. అక్కడ్నుంచి మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకుని వస్త్రాలను బహూకరించి మూలవర్లను దర్శించుకుంటారు. ఆ సమయంలో జీయ్యంగార్లు శేషవస్త్రాన్ని మెడలో ధరింపచేస్తారు. రంగనాయకుల మండపంలో వేదపండితుల ఆశీర్వచనం తర్వాత టీటీడీ 2025 డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తారు. అనంతరం వాహనం మండపం వద్దకు చేరుకుని పెద్దశేషవాహన సేవలో పాల్గొంటారు. ఆ తర్వాత పద్మావతి విశ్రాంతి భవనంలో బస చేసి.. శనివారం ఉదయం వకుళమాత సెంట్రల్ కిచెన్ ప్రారంభించి తిరుగు ప్రయాణమవుతారు.

పెరిగిన రద్దీ: గురువారం మధ్యాహ్నం నుంచి తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. నడకమార్గాల్లో, వాహనాల్లో భారీగా తిరుమలకు చేరుకుంటున్నారు. దీంతో శ్రీవారి ఆలయం మొదలుకొని మాడవీధులు, బస్టాండ్, లడ్డూకౌంటర్, అన్నప్రసాద కాంప్లెక్స్, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లు, కల్యాణకట్టలు, గదుల కేటాయింపు కేంద్రాలు భక్తులతో రద్దీగా మారాయి.



గల్లా రామచంద్ర నాయుడికి మహాత్మ అవార్డు

రేణిగుంట, అక్టోబరు 3: అమరరాజా గ్రూప్ వ్యవస్థాపకుడు డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు మహాత్మా జీవితకాల సాఫల్య అవార్డును అందుకున్నారు. గురువారం న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో పుదుచ్చేరి మాజీ గవర్నర్ కిరణ్‌బేడీ ఈ అవార్డును అందజేశారు. నాలుగు దశాబ్దాలుగా సామాజిక బాధ్యత, పర్యావరణ అనుకూలతలను మెరుగుపరుస్తూ.. యువతకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ.. గ్రామీణప్రాంతాల నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తూ.. కార్పొరేట్ సామాజిక బాధ్యతనూ విజయవంతంగా నిర్వహించడంతో ఈ అవార్డును అందజేశారు.

ఎఫ్‌పీ షాపు డీలర్‌షిప్ ఖాళీల భర్తీకి షెడ్యూల్ మార్పు

20న నోటిఫికేషన్ ● నవంబరు 5న రాతపరీక్ష

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 3: ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న చౌకదుకాణ (ఎఫ్‌పీ) డీలర్‌షిప్‌ల ఖాళీల భర్తీకి ప్రభుత్వం షెడ్యూల్ మార్పు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఖాళీల భర్తీకి ఇది వరకు నవంబరు 7న రాత పరీక్ష, 12న మౌఖిక పరీక్ష జరుగుతుందని షెడ్యూల్‌ను విడుదల చేశారు. తాజా షెడ్యూల్‌మేరకు నవంబరు 5న రాతపరీక్ష, 7న మౌఖికపరీక్ష జరగనుంది. జిల్లాలో ప్రస్తుతమున్న రేషన్‌కార్డుల రేషనలైజేషన్‌తో పాటు ఖాళీలున్న చోట డీలర్లను నియమించాలని ప్రభుత్వం ఆదేశించింది. కార్డుల రేషనలైజేషన్ ద్వారా 49 దుకాణాలు పెరగనున్నాయి. వివిధ కారణాలతో ఖాళీలు ఏర్పడి డీలర్‌షిప్‌లు లేని షాపులు 400 ఉన్నట్లు ఇదివరకు అధికారులు గుర్తించారు. ఖాళీల భర్తీ కోసం ఈ నెల 20న ఆయా ఆర్డీవోలతో నోటిఫికేషన్ విడుదల, నవంబరు 5న రాత పరీక్ష, 7న మౌఖిక పరీక్ష, 10న ఎంపికైన వారి తుదిజాబితా విడుదల, 14న కొత్త డీలర్లకు ఈ-పోస్ మెషిన్ల పంపిణీ జరగనుంది. అన్నీ అనుకూలిస్తే డిసెంబరు ఒకటో తేదీనుంచి కొత్త డీలర్లు అందుబాటులోకి వస్తారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



సురేష్ (ఫైల్ ఫొటో)

నింద్ర, అక్టోబరు 3: అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నింద్ర మండలం కైపాకం గ్రామానికి చెందిన రైతు సురేష్(44)కు కేఆర్‌పాలెం లెక్కదాఖలాలో సుమారు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో బోర్లు వేయడం, పంట నష్టపోవడంతో సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేకపోయాడు. ఈ బాధతో బుధవారం సాయంత్రం పెయింట్‌లో కలిపే ద్రావణం తాగేశాడు. స్పృహ తప్పి పడిపోవడంతో స్థానికులు గమనించి వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రూ.15వేల దివ్యాంగ పింఛను తొలగిస్తారా?

పెట్రోల్ బాటిల్‌తో దివ్యాంగుడి నిరసన



శ్రీరంగరాజపురం, అక్టోబరు 3: తనకు మంజూరైన రూ.15వేల దివ్యాంగ పింఛను తొలగిస్తారా? అంటూ పెట్రోల్ బాటిల్ తీసుకొచ్చి ఓ దివ్యాంగుడు నిరసన తెలిపాడు. ఈ సంఘటన ఎస్ఆర్‌పురం ఎంపీడీవో కార్యాలయం ముందు గురువారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పద్మాపురం దళితవాడకు చెందిన దివ్యాంగుడైన హేమాద్రి(45) రూ.75 ఇస్తున్నప్పటి నుంచే పింఛను తీసుకుంటున్నాడు. గత నెలలో ఇతడికి రూ.15వేల పింఛను మంజూరైంది. అయితే తమ గ్రామంలోని టీడీపీ చెందిన మాధవ నాయుడు ఫిర్యాదుతో తన పింఛను తొలగించారని ఆరోపించారు. ఇద్దరు పిల్లలు ఉన్నారని, కుమారుడి ఆరోగ్యం బాగాలేదని.. పింఛను ఇవ్వకుంటే కుటుంబీకులతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానంటూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట పెట్రోల్ బాటిల్‌తో నిరసన తెలిపాడు. దీనిపై ఎంపీడీవో మురళీమోహన్‌ని వివరణ కోరగా.. గత నెలలో అనర్హులను గుర్తించామని, అందులో హేమాద్రి కూడా ఉన్నాడన్నారు. ఇతడికి దివ్యాంగుల పింఛను రూ.6వేలను మంజూరు చేస్తామని చెప్పడంతో హేమాద్రి నిరసన విరమించి, వెళ్లిపోయాడు.

అప్పుడులేని ప్రొటోకాల్ ఇప్పుడు వైసీపీకి గుర్తుకొచ్చిందా ?

టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి విమర్శ



బోయకొండ దసరా మహోత్సవం ఆహ్వాన పుస్తకంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఫొటో

చౌడేపల్లె, అక్టోబర్ 3: వైసీపీ ప్రభుత్వ హయాంలో బోయకొండ దసరా మహోత్సవాల్లో ఆలయ అధికారులు, వైసీపీ నాయకులు ప్రొటోకాల్ పాటించలేదని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. 2022, 2023 దసరా బుక్‌లెట్‌లో మాజీ సీఎం చంద్రబాబు ఫొటో లేకపోగా ప్రొటోకాల్ లేని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఫొటో మాత్రం 2020, 2021, 2022, 2023 దసరా మహోత్సవ ఆహ్వాన బుక్‌లెట్‌లో ప్రత్యేకంగా ఒక పేజీ కేటాయించి ఫొటోలు వేసినప్పుడు గుర్తుకు రాలేదా ప్రొటోకాల్ అని విమర్శించారు. అప్పుడు అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఆయన కుమారుడు ఎంపీ మిధున్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డిలకు ప్రొటోకాల్ గుర్తు రాలేదా ప్రొటోకాల్ అని ప్రశ్నించారు. వైసీపీ నాయకులు మాత్రం మాజీ సీఎం చంద్రబాబు ఫొటో లేకుండా వేస్తే మాత్రం అది ప్రోటోకాల్ పాటించినట్లు తాము మాత్రం పాటించలేదని విమర్శించటం తగదన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయ వసతిగృహాల్లో బయోమెట్రిక్ ద్వారా గదుల కేటాయింపు

శ్రీకాళహస్తి, అక్టోబరు 3: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలోని వసతిగృహాల్లో గదులను బయోమెట్రిక్ ద్వారా కేటాయించనున్నట్లు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్వో కార్యాలయం వద్ద, వసతి సముదాయంలో కానీ గదులను బుక్ చేసుకోవచ్చన్నారు. ఆధార్‌కార్డు, ఏదైనా ఇతరగుర్తింపు కార్డులతో స్వయంగా బుక్ చేసుకోవాలని తెలిపారు.

వైఖానస ఆగమాలపై శిక్షణ

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 3: దైవారాధనలో వైఖానస ఆగమ అర్చనా విధులపై తొమ్మిది రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం డీన్ వీఎస్ విష్ణుభట్టాచార్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్చన ప్రయోజనం, ఉపచారాల రకాలు, అర్చనలో వినియోగించే ద్రవ్యాలు, ఆగమాలలో వైఖానసాగమ స్వరూపం అనే వివిధ విషయాలపై సంస్కృత విశ్వవిద్యాలయం ఆన్‌లైన్ విధానంలో ఈనెల 16 నుంచి తొమ్మిది రోజులు శిక్షణ ఇస్తుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు పేర్ల నమోదు, వివరాల కోసం htpp://forms.gle/dbhmjwtor2h9pj1ka వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ఈతకు వెళ్లి ఇద్దరు యువకుల దుర్మరణం



తోహిద్





ఇర్ఫాన్ - చెరువు వద్ద గుమికూడిన జనం

బంగారుపాళ్యం, అక్టోబరు 3 :చెరువులో సరదాగా ఈత కొట్టడానికి వెళ్లిన ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు.పోలీసుల కథనం ప్రకారం...బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లె పంచాయతీ ఇందిరమ్మకాలనీకి చెందిన ఖాదర్‌బాషా కుమారుడు తోహిద్(16), మహబూబ్ షరీఫ్ కుమారుడు ఇర్ఫాన్(16), అదే కాలనీకి చెందిన మరో యువకుడు తోహిద్ కలిసి గురువారం కిలోమీటరు దూరంలో ఉన్న ఊటువంక చెరువు వద్దకు ఈతకు వెళ్లారు.ముందుగా తోహిద్, ఇర్ఫాన్ దుస్తులను తీసి గట్టుపై పెట్టి చెరువులోకి దిగారు.లోతు ఎక్కువగా ఉండడంతో తోహిద్, ఇర్ఫాన్ మునిగిపోతుంటే గట్టుపై ఉన్న తోహిద్ వారిని రక్షించడానికి చేతులు పట్టుకుని కొంతవరకు పైకి లాగాడు.అతని వల్లకాకపోవడంతో వారిని వదిలేసి కేకలు వేశాడు.చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో కొంత దూరం పరుగెత్తికెళ్లి రోడ్డున వెళ్లేవారికి చెప్పాడు. ఊటువంకకు చెందిన కొంతమంది సంఘటనా స్థలానికి చేరుకుని తోహిద్ మృతదేహాన్ని పైకి తీశారు.ఇర్ఫాన్ మృతదేహం లభించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. చిత్తూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాలించి ఇర్ఫాన్ మృతదేహాన్ని వెలికితీశారు.మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

నవ చండీయాగం ప్రారంభం

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 3: చిత్తూరు నియోజక వర్గ ప్రజలు పాడిపంటలు, సుఖ శాంతులతో జీవించాలనే తలంపుతో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్.. నవ చండీ యాగాన్ని గురువారం ప్రారంభించారు. నగరంలోని సంత పేట జీజేఎం ఫంక్షన్ హాలులో బ్రహ్మర్షి బాలకృష్ణ బృందం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ యాగంలో తన కుటుంబీకులతో కలిసి పాల్గొన్నారు. తొమ్మిది రోజులపాటు జరిగే ఈ యాగంలో నగరవాసులు పాల్గొనాలని ఎమ్మెల్యే కోరారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేశ్‌కుమార్ రెడ్డి, మాజీ మేయర్ కఠారి హేమలత, చిత్తూరు, గుడిపాల, రూరల్‌కు చెందిన కూటమి శ్రేణులు హాజరయ్యాయి.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు



బుగ్గ, దేశమ్మ దేవాలయాలు

నగరి, అక్టోబరు 3: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు దుర్గాదేవి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. శుక్రవారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించ డానికి భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. దేశమ్మ దేవాలయంలో 4న బాల త్రిపుర సుందరిగా, 5న గాయత్రీదేవిగా, 6న అన్నపూర్ణ దేవిగా, 7న లలితా త్రిపుర సుందరిగా, 8న మహాలక్ష్మిగా, 9న సరస్వతీ దేవిగా, 10న దుర్గాదేవిగా, 11న మహిషాసుర మర్దినిగా, 12న రాజరాజేశ్వరిదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమి వ్వనున్నారు. టీటీడీ ఆధీనంలో బుగ్గ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర, నగరి పట్టణంలోని కరకంఠేశ్వర స్వామి ఆలయంలోని కామాక్షిదేవి సన్నిధి, ఓంశక్తి, వాసవీ కన్యకా పరమేశ్వరి, పుత్తూరు పట్టణంలోని వాసవీ కన్యాకాపరమే శ్వరి, శివాలయం, రాజపాలెం, లక్ష్మీదుర్గమ్మ కొండ, ఆరే టమ్మ ఆలయాలు కూడా ముస్తాబవుతున్నాయి.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 3: కాణిపాకంలోని వరసి ద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్య క్రమానికి రూ.1,00,116 విరాళంగా అందింది. హైదరాబా ద్‌కు చెందిన వంశీధర్‌రెడ్డి గురువారం ఆలయాధికారులకు ఈ మొత్తాన్ని అందజేశారు.

కాలినడక భక్తులకు అన్నదానం

విజయపురం, అక్టోబరు 3: తమిళనాడు నుంచి తిరుమ లకు నడిచి వెళ్లే భక్తులకు పాతార్కాడులో గురువారం గ్రామసమాఖ్య ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ప్రతి ఏటా అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దసరా ఉత్సవాలు ప్రారంభం

దుర్గాంబ ఆలయంలో మహా చండీహోమం ● పలు రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 3: నగరంలో పలు ఆలయాల్లో గురువారం దసరా ఉత్సవాలు ప్రారంభ మయ్యాయి. గిరింపేట దుర్గాంబ ఆలయంలో పాల కమండలి చైర్మన్ దిలీప్‌రెడ్డి, ఈవో మునిశేఖర్ ఆధ్వ ర్యంలో అమ్మవారికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తల్లిదండ్రులు గురజాల చెన్నకేశవులు నాయుడు దంపతులతో మహా చండీహోమం చేయించి, ఉత్స వాలు ప్రారంభించారు. కావాల్సిన ఏర్పాట్లను మాజీ చైర్మన్ వీకే విశ్వనాథ్ చేశారు. అలాగే డిప్యూటీ మేయర్ ఆర్సీ చంద్రశేఖర్ కుటుంబ సభ్యులతో అమ్మవారికి 108 బిందెల పాలు, 1008 బిందెల జలంతో అభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవా రిని మహాలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ దర్శించుకున్నారు.



దుర్గాంబను దర్శించుకున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తదితరులు

గురువారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమ య్యాయి. తొలిరోజున బాల త్రిపుర సుందరి అవతా రంలో అమ్మవార్లు దర్శనమి చ్చారు. ● వెదురుకుప్పం మండలం చవటగుంట ఆవుదేవర నందీశ్వరాలయం లోని రాజరాజేశ్వరి అమ్మ వారి ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలను ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

కాత్యాయనిగా వాసవీ కన్యకా పరమేశ్వరి



బ్రాహ్మణ వీధి వాసవీ కన్యకా పర మేశ్వరి అమ్మవారు కాత్యాయనిగా భక్తు లకు దర్శనమిచ్చారు. అలాగే పలు అమ్మ వారి ఆలయాల్లోనూ పూజలు జరిగాయి. కోదండ రామాల యంలో స్వామివారు మత్స్యావతారంలో కనువిందు చేశారు. మహాలక్ష్మి గోదాదేవి ఆంజనేయ సమేత వేంకటేశ్వరాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం శ్రీనివాస ట్రస్టు ప్రతినిధులు అంకురార్పణ నిర్వహించారు.

బాలత్రిపుర సుందరిగా బంగారమ్మ

వెదురుకుప్పం: కార్వేటి నగరంలోని గ్రామ దేవత బంగారమ్మ, డైట్ సమీపంలోని అంకాల పరమేశ్వరి, స్కంద పుష్కరిణి సమీపంలోని రాజరా జేశ్వరి, పాత డేరా కండ్రిగలోని నేనే రమ్మ, రాజ బంధు వుల వీధిలోని రాజ రాజేశ్వరి ఆలయాల్లో



బాలత్రిపురసుందరిగా అల్లియెల్లమ్మ



గంగాధరనెల్లూరు: గ్రామంలోని అల్లియెల్లమ్మ దేవత గురువారం బాలత్రి పురసుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మునీశ్వరనాడార్, ఉమా, తంగవేలునాడార్, వేలు మణి నాడార్ కుటుంబస భ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

శైలపుత్రీదేవిగా గంగమ్మ



శ్రీరంగరాజపురం: ఎస్ఆర్ పురం మండలం గంగమ్మ గుడి ఆలయంలో గురువారం అమ్మ వారు శైలపుత్రిదేవి అలంకరణతో దర్శన మిచ్చారు. ఉభయదా రులుగా పద్మావతమ్మ, హిమాచలపతిరెడ్డి వ్యవహ రించారు.

మహాలక్ష్మి ఆలయంలో..

నింద్ర: కూనమరాజుపాలెంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో, గీతా మందిరం ఆశ్రమంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమ య్యాయి. ఉదయం అమ్మవారికి అభిషేకం చేసి, వివిధరకాల పుష్పాలతో సుందరంగా అలంకరిం చారు. తొమ్మిది గంటలకు గోపూజ నిర్వహించాక ఆలయ ప్రధాన అర్చకుడు రూపేష్ కృష్ణ ఆచా ర్యులు ధ్వజారోహణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.



సరస్వతీదేవిగా మరగదాంబిక



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 3: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవాలయానికి అనుబంధంగా ఉన్న మరగదాంబిక దేవి సమేత మణికంఠేశ్వర స్వామి ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం భక్తుల ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహిం చారు. రాత్రి అమ్మవారి ఉత్సవర విగ్రహాన్ని కాణి పాకం పురవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకు న్నారు. ఈవో గురుప్రసాద్, ఏఈవోలు రవీంద్ర బాబు, ఎస్పీ కృష్ణారెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి, మాజీ చైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో ఖాళీ జాగాలపై ఖర్చీఫ్



వాగ్వాదం చేసుకుంటున్న ఇద్దరు నేతలు - శుభ్రం చేసిన ప్లాట్లు

● ఇద్దరు టీడీపీ నేతల మధ్య వాగ్వాదం

చిత్తూరు, అక్టోబరు 3: ఇందిరమ్మ కాలనీలోని ఖాళీ జాగాల ఆక్ర మణ విషయం.. గురువారం ఇద్దరు టీడీపీ నాయకుల మధ్య వాగ్వా దానికి కారణమైంది. ఓ నేత కబ్జాకు ప్రయత్నిస్తే.. మరో మాజీ కార్పొరే టర్ ఇది తన పరిధి అని అడ్డుకున్నారు. అధికారులు మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో గతంలో డబ్బులిచ్చి స్థలాలను కొనుగోలు చేసినవారంతా లబోదిబోమంటున్నారు. నగరంలోని 49వ డివిజన్ పరిధిలో ఇందిరమ్మ కాలనీ ఉంది. దీన్ని వైఎస్.. సీఎంగా ఉన్నప్పుడు ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనూ ఇక్కడ కొంతమందికి పట్టాలిచ్చారు. దాని ముసుగులో కొంతమంది వైసీపీ నాయకులు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేసి.. రెవెన్యూ అధికారుల సాయంతో పొజిషన్ పట్టాలను అమ్ముకున్నారు. గతంలో చిత్తూరు తహసీల్దార్‌గా పనిచేసిన మురళీమోహన్ సుమారు 450మందికి రెవెన్యూ రికార్డుల్లో వివరాలు లేకుండా పట్టాలిచ్చేసినట్లు ఉన్నతాధికారులు తేల్చారు. దీంతో ఒకరి ప్లాటు నెంబరుతో మరొకరికి పట్టా ఇవ్వడం, పట్టాల్లోని సరిహద్దులు క్షేత్రస్థాయిలో లేకపోవడం.. వంటివి ఇక్కడ సర్వసాధారణంగా మారాయి. ఈ కాలనీలో రోజూ ఎవరో ఒకరు తమ ప్లాట్లను ఆక్రమించుకున్నారని పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు.

తాజాగా ఏం జరిగిందంటే..

ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఒకటో డివిజన్ ద్వితీయ శ్రేణి నాయకుడు గతవారం పోలీసులతో కలిసి ఇందిరమ్మకా లనీ వద్దకు వెళ్లాడు. అక్కడ ఖాళీగా ఉన్న ప్లాట్లను శుభ్రం చేయిం చాడు. దాంతో అప్పట్లో డబ్బులిచ్చి తీసుకున్న వారు తమ స్థలాలని చెప్పినా వినిపించుకోకుండా కొన్ని ప్లాట్లను శుభ్రం చేయించి వెళ్లిపో యాడు. ప్రభుత్వమే పట్టాలిచ్చినా.. ఆర్థిక ఇబ్బందులతో ఇల్లు కట్టుకో లేని వారి జాగాను సైతం ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేశారు. దీంతో వారంతా ఆ నేత ఇంటి వద్దకు క్యూకట్టారు. తాజాగా గురువారం అదే నాయకుడు తిరిగి కొన్ని ప్లాట్లను ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేసే పనిని ప్రారంభించాడు. విషయం తెలుసుకున్న 49వ చెందిన అధికార పార్టీ మాజీ కార్పొరేటర్ వచ్చి అడ్డుకున్నాడు. తన వార్డు పరిధిలో.. తనను అడగకుండా ఎలా పనులు చేస్తారని ప్రశ్నించారు. పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను బయటికి పంపాలని చెప్పడంతో వాగ్వాదం జరిగింది. గొడవ పెద్దదయ్యే అవకాశం ఉండటంతో పోలీసులొచ్చి ఎక్స్‌కవేటర్‌ను అక్కడినుంచి పంపించేశారు.

ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

● వరసిద్ధుడి ఆలయ బ్రహ్మోత్సవాల విజయవంతంపై జేసీ

ఐరాల(కాణిపాకం), అక్టో బరు 3: కాణిపాక వరసిద్ధుడి ఆలయ బ్రహ్మోత్సవాల విజ యవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలని జేసీ విద్యాధరి అన్నారు. గురువారం ఆలయ ఆస్థాన మండపంలో ఎమ్మెల్యే ముర ళీమోహన్ అధ్యక్షతన ఆమెకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయదా రులు, అన్నిశాఖల అధికారులను జేసీకి దుశ్శాలువా కప్పి, జ్ఞాపికను అందజేశారు. 21 రోజులపాటు ఉత్సవాలు నిర్వహించడం ఆషామాషీ కాదన్నారు. ఎమ్మెల్యే ఎంతో సహకారం అందించారన్నారు. అధికారులు కూడా చాలా శ్రమించారన్నారు. ఈవో గురుప్రసాద్, ఈఈ వెంకటనా రాయణ, ఎస్పీ మణికంఠ, జడ్పీటీసీ సుచిత్ర, మాజీ జడ్పీ టీసీ లత, మాజీ చైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు, ఏఈవోలు పాల్గొన్నారు.



జేసీ విద్యాధరికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్

కాణిపాకంలో వనమహోత్సవం

కాణిపాకంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ శాఖ ఆదేశాలతో ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురు ప్రసాద్ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో, డార్మెటరీ హాల్ ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటారు. ఈఈ వెంకటనారా యణ, ఏఈవో ఎస్పీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ చర్యలు

వెదురుకుప్పం, అక్టోబరు 3: కార్వేటినగరం మండలం కేపీ అగ్రహారం పంచాయతీలోని పలు గ్రామాల్లో గురువారం సర్పంచ్ కామసాని శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. అలాగే పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు.

సీసీరోడ్డుకు భూమిపూజ

గంగాధరనెల్లూరు, అక్టోబరు 3: తూగుండ్రం గ్రామంలో శ్మశానానికి వెళ్లే దారిలో కొత్త సిమెంట్ రోడ్డును నిర్మించడానికి సర్పంచ్ శ్రీబాబు అధ్యక్షతన అధికారులు, టీడీపీనేతలు కలిసి గురువారం భూమిపూజ నిర్వహించారు. తూగుండ్రం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ నరసింహులు నాయుడు, పార్లమెంట్ టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి జీవరత్నం, తూగుండ్రం టీడీపీ కమిటీ అధ్యక్షుడు నీరజా క్షులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని ఒకరి దుర్మరణం

నింద్ర, అక్టోబరు 3: వాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివ రాల మేరకు.. తిరువళ్లూరు జిల్లా రాచపాలెం గ్రామానికి చెందిన అనంతవర్మ.. విజయపురం మండలం పన్నూరు గ్రామానికి గురువారం బైక్‌పై బయల్దేరాడు. నగరి-నాగలాపురం రోడ్డులో నింద్రలోని శ్రీసరస్వతి కాటన్ మిల్ వద్దకొచ్చేసరికి ఎదురుగా వస్తున్న గుర్తు తెలి యని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు



రాజేశ్వరి

గంగాధర నెల్లూరు, అక్టో బరు3: ఓ యువతి కనపడటం లేదని ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. సీఐ కె.లక్ష్మీనారా యణ తెలిపిన వివ రాల మేరకు కొత్త వెంకటాపురం పంచాయతీ కె.వి.దొడ్డిపల్లె గ్రామానికి చెందిన సుమిత్ర, భాస్కర్‌రె డ్డిల కుమార్తె రాజేశ్వరి(19) రెండ్రోజుల నుంచి కనిపించడం లేదని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాయితీలపై రైతులకు అవగాహన

వెదురుకుప్పం, అక్టోబరు 3: సంతబైలు, వెదురు కుప్పం, మొండివెంగనపల్లె గ్రామాల్లో గురువారం ఏవో వనిత ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్ర మాన్ని చేపట్టారు. ఈ క్రమంలో రైతులకు పంటల సాగుపై యాజమాన్య పద్ధతులు, ప్రభుత్వం కల్పి స్తున్న రాయితీలు, ఇతర పథకాలను తెలియజేశారు. అలాగే రైతుల పొలాలను సందర్శించారు.

పనిభారం తగ్గించాలి: తపాలా సిబ్బంది

బంగారుపాళ్యం, అక్టోబరు 3: టార్గెట్ పేరుతో తమను వేధించడం ఆపాలని బంగారుపాళ్యం తపా లాశాఖ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ పిలుపు మేరకు గురువారం కార్యాలయం ముందు ఈ మేరకు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో తపాలాశాఖ డివిజన్ కార్యదర్శి అరుణ, మహేష్, రామాంజినేయులు, పాండు, రవి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం: జేసీ

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 3: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ ఎస్)లో అందే అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జేసీ విద్యాధరి అన్నారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫ రెన్స్ నిర్వహించారు. ఫ్రీహోల్డ్ రైట్స్ భూములకు సంబంధించిన రికార్డులను శనివారంలోగా కలెక్టరేట్‌కు ఆర్డీవోలు అందించాలని చెప్పారు. డీఆర్వో పుల్లయ్య, ఏవో కులశేఖర్, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.


ఎస్‌ఐకి సన్మానం



విజయపురం, అక్టోబరు 3: ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరిం చిన బలరామయ్యను టీడీపీ నేతలు గురువారం సన్మానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు దిలీప్‌కుమార్, హరికృష్ణా, నారా యణరాజు, చెంచయ్య, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతికి నివాళి: మహారాజపురం దళితవాడలో టీడీపీ సీనియర్ నాయకుడు సుబ్రహ్మణ్యం గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మ ణ్యంరాజు, నాయకులు బాబుయాదవ్, లోకేష్‌రాజు, వెంకటేసులుయాదవ్, కాటయ్య తదితరులు పూలమాల వేసి, నివాళి అర్పించారు.

వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి: డీఎంహెచ్‌వో



రోగితో మాట్లాడుతున్న ప్రభావతి

పూతలపట్టు, అక్టోబరు 3: ప్రభుత్వ వైద్యాధికారులు, సిబ్బంది అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎం హెచ్‌వో ప్రభావతి ఆదేశించారు. గురువారం పి.కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఇక్కడికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోందని, వైద్యాధికారులు రాత్రిపూట కూడా రోగులకు సేవలందించాలని చెప్పారు.

ఎన్టీఆర్ జలాశయాన్ని పరిశీలించిన కమిషనర్

చిత్తూరు, అక్టోబరు 3: కల్వకుంట వద్ద ఉన్న ఎన్టీఆర్ జలాశయాన్ని గురు వారం నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ పరిశీలించారు. ప్రస్తుతం జలాశయంలో నీటి మట్టం ఎంత ఉంది, ఇంకెంతకాలం నగరానికి సరిపోయే అవకాశం ఉంది అనే వివరాలపై ఆరా తీశారు. అనంతరం జలాశయంలోని పంపుహౌస్‌లో మోటర్లను తనిఖీ చేశారు. అక్కడినుంచి పూనేపల్లె వద్ద ఉన్న ట్రీట్‌మెంట్‌ప్లాంట్‌ను కూడా పరిశీలించారు.

ఐరాల యూటీఎఫ్ కార్యవర్గం



దేవరాజులు నాయుడు | అరుణ్ కుమార్

ఐరాల, అక్టోబరు 3: పొలకల జడ్పీ హైస్కూ ల్‌లో గురువారం ఐరాల యూటీఎఫ్ కార్యవ ర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కె.ప్ర భాకర్, అధ్యక్షుడిగా దేవరాజులునాయుడు, అసోసియేట్ అధ్యక్షులుగా లీలావతి, జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా అరుణ్‌కుమార్, కోశాధికా రిగా సుధాకర్, మండల కార్యదర్శులుగా గుణసుందరి, నాగరాజు, కేశవులు, విజయలక్ష్మి, అమ్ములు,విజయప్రసాద్, రోజారాణి,ప్రదీప్, మాధవరెడ్డి, గాయత్రి ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారి సోమశేఖర్‌నాయుడు తెలిపారు.


విశాఖ ఉక్కు పరిరక్షణ అందరి బాధ్యత

నగరి, అక్టోబరు 3: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టి.జనార్దన్ అన్నారు. గురువారం ఉదయం విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం రాష్ట్ర రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు బస్టాండు ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్, ఏఐటీయూసీ నాయకుడు షబ్బీర్ బాషా, ఏఐవైఎఫ్ కార్యదర్శి విజయన్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి చెక్‌పోస్టు

పాలసముద్రం, అక్టోబరు 3: గంగాధరనెల్లూరు మండలం నీవానది నుంచి పాలసముద్రం మండలం మీదుగా తరచూ ఇసుక అక్రమ రవాణా జరుగు తోంది. దీంతో కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో మండలంలో తమిళనాడుకు సరిహద్దు ప్రాంతమైన దీనబంధుపురం వద్ద జిల్లా భూగర్భ గనుల శాఖ ఆధ్వర్యంలో చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. వనదుర్గాపురం, సింహరాజుపురం, నరసింహాపురం గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ భారతి తెలిపారు.

వరద బాధితులకు అపోలో విద్యార్థుల సాయం



చిత్తూరు రూరల్, అక్టోబరు 3: విజయ వాడ వరద బాధితు లకు అపోలో యూనివ ర్సిటీకి చెందిన పబ్లిక్ హెల్త్ విద్యార్థులు.. కొన్ని స్వచ్ఛంద సంస్థల చేయూతతో సాయం అందించారు. గురువారం విజయవాడకు వెళ్లి 100 కుటుంబాలకు దోమతెర, దుస్తులు, దుప్పట్లు, పుస్తకాలు, బ్యాగులు, ఫస్ట్‌ఎయిడ్ కిట్లను వితరణ చేశారు. సోషల్ రెస్పాన్సిబిలిటీ క్లబ్ సభ్యులు, సెంటర్ ఫర్ కమ్యూనిటీ ఎంగేజ్మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ మహేంద్రనాథ్, సాడ్స్, గైడ్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'హిమోగ్లోబిన్' పరీక్షలు

వెదురుకుప్పం, అక్టోబరు 3: వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు హిమోగ్లోబిన్ రక్తపరీక్షలు నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణశారద, రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటరు డాక్టర్ డి.లావణ్య కుమారి గురువారం తెలిపారు. మొత్తం 40మందికి పరీక్షలు చేయించామని చెప్పారు.